కథ

**"సతీష్! ఎక్కడికెళ్ళావు ఇంతసేపూ" కిరణ్ సతీష్‌ని అడిగాడు.**

**"అనితా మేడమ్‌కు అడ్వాన్సస్ సీటు క్రొత్త కదా. డౌట్సుంటే క్లారిఫై చేసి వచ్చా"**

**"అయితే హాలులోనే ఉన్నావా? నేను పావుగంట నుంచీ వెతుకుతున్నాను నీ కోసం" అని "హలో అనితగారూ..సతీష్‌ను మీరు ఉంచుకున్నారా యింతసేపూ" అని అరిచాడు.**

ఒళ్ళు మండింది అనితకు. 'ఉంచుకోవడమేమిటి? కిరణ్ పరాయి భాష వాడు కాదు. అచ్చమైన తెలుగు వాడే. అవకాశమొచ్చినప్పుడల్లా అలా ద్వంద్వార్థాలతో, శ్లేషలతో మాట్లాడతాడు. అదో ఆనందం అతనికి. ఎటొచ్చీ తమకే నలుగురి ముందు అవమానంగా ఉంటుంది' అనుకొంది విసుగ్గా.

ఈ బాధ ఆమె ఒక్క దానిదే కాదు. బ్రాంచిలో ఉన్న ప్రతి లేడీ అతనివల్ల, అతని మాటల వల్ల ఇబ్బంది పడుతున్న వారే. కిరణ్ ఆ బ్రాంచిలో యూనియన్ లీడరు. అందువల్ల అతనికి ఎదురు తిరిగి మాట్లాడే ధైర్యం చాలామందికి లేదు. ముఖ్యంగా ఆడవాళ్ళకి. ముప్ఫై ఏళ్ళ కిరణ్‌కు ఇంకా పెళ్ళి కాలేదు. అతని ప్రతి మాటలో ద్వంద్వార్థం ఉంటుంది. అలా మగ కొలీగ్స్‌తో మాట్లాడితే పెద్దగా ఇబ్బంది లేదు. కానీ ఆడవాళ్ళతో కూడా అలాగే మాట్లాడుతూంటాడు. అలా మాట్లాడకూడదని అతనికి తెలుసు. కానీ బ్రాంచిలో తనను ఎవరూ ఏమీ అనలేరని ధైర్యం.

పైగా అతను బ్రాంచిలో అతి ముఖ్యమైన ఎస్టాబ్లిష్‌మెంట్ సీటులో ఉండటంతో అందరికీ అతనితో అవసరం ఉంటుంది. అది అలుసుగా తీసుకొని తన సీటు వద్దకు వచ్చిన ఆడవాళ్ళతో ద్వంద్వార్థాలతో మాట్లాడి, వాళ్ళు ఇబ్బందిపడుతూంటే నవ్వుకుంటూ ఉంటాడు.

ఆరోజు సాయంత్రం ఉమ అతని సీటు దగ్గరికి వచ్చి-

"సార్! మీరు ఫ్రీగా ఉన్నారా? నాకు టాక్స్ ఎంత పడుతుందో చూసి చెప్పాలి" అంది.

"మీది మొత్తం చూపించండి నాకు. అప్పుడు చెప్తాను" అన్నాడు కిరణ్. ప్రక్కనే ఉన్న ముగ్గురు మగ కొలీగ్స్ గట్టిగా నవ్వారు.

"ఐ మీన్ మీ టోటల్ సాలరీ, సేవింగ్స్ పర్టిక్యులర్స్ యివన్నీ చూపించమని నా ఉద్దేశ్యం"

ఉమకు కళ్ళనీళ్ళు వచ్చాయి. అతని మాటలకు, ప్రక్కనున్నవారి నవ్వులకు, చాలా అవమానంగా అనిపించింది. ఇక అక్కడ ఉండలేనట్లు తన సీటు వద్దకు వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు లేడీ స్టాఫ్ అందరూ ఓ మూల కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

ఉమ- కిరణ్ తనతో అన్న మాటలు మిగతా వారితో చెప్పుకొని బాధపడింది.

"రోజు రోజుకీ వాడి నోరుకు అడ్డూ, అదుపూ లేకుండా పోతూంది. మిగతా స్టాఫ్ ముందు ఎంత అవమానంగా ఉంటుందో?" కవిత అంది.

"ఒక్కోసారి కస్టమర్స్ ముందు కూడా అలాగే మాట్లాడుతుంటాడు. సిగ్గుతో చచ్చిపోవాలనిపిస్తుంది. ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేసి వేరే బ్రాంచికి వెళదామంటే ఈ ఊర్లో యింకో బ్రాంచి లేదాయె" అంది లక్ష్మి.

ఇంతలో ప్రణవ్ అటుగా రావడం చూసి మాటలు నిలిపి అతని వైపు చూసి నవ్వారు.

# ఫలించిన పథకం

"ఏమిటి, మహిళామండలి అత్యవసర సమావేశమా? బహుశా 'మొగుడితో వంట చేయించడం ఎలా' అన్న టాపిక్ మీద చర్చ జరుగుతుందేమో" అన్నాడు ప్రణవ్ నవ్వుతూ.

"మాకు అంత అదృష్టం కూడానా" అంది ఉమ.

"ఏనీవే ఐ విష్ యువర్ మీటింగ్ ఆల్ సక్సెస్" అంటూ వెళ్లిపోయాడు.

"ప్రణవ్ ఎంత బాగా బిహేవ్ చేస్తాడు. ఎన్నో జోక్స్ వేస్తూంటాడు కానీ అందులో అసభ్యత ఉండదు. ఆడవాళ్ళకు ఎంతో మర్యాద ఇస్తాడు. మళ్ళీ అందరితో క్లోజ్‌గానూ వుంటాడు. హస్తి మశకాంతరం అంటారే అలా వుంటుంది ప్రణవ్‌కూ, కిరణ్‌కూ పోలిక" ఉమ అంది.

"మనం ప్రణవ్‌కు విషయం చెప్పి అతని సలహా కోరితే" అంది లక్ష్మి.

"మన ప్రాబ్లెమ్స్ ఒక మగవాడితో చెప్పుకోవడం ఎంత వరకు సబబు" అంది కవిత.

"సబబే. ఎందుకంటే మనకు ప్రాబ్లెమ్ ఓ మగవాడివల్లే కలుగుతోంది కనుక" అంది ఉమ.

"నువ్వెళ్ళి పిలిచిరా" అంటూ లక్ష్మితో చెప్పి ఉమతో-

"మీరు మా అందర్లోకి పెద్దవారు కనుక మీరే ప్రణవ్‌తో మాట్లాడండి" అంది అనిత.

ప్రణవ్ రాగానే టూకీగా తాము కిరణ్ వల్ల పడుతున్న బాధలు చెప్పింది ఉమ.

"మీరు పడుతున్న బాధ నేనూ గమనించాను. మీరే అతనికి బుద్ధి చెబుతారని ఎదురు చూస్తున్నాను"

"మాకంత ధైర్యం లేదు. పోనీ ఏం చేయాలో మీరే మాకు సలహా ఇవ్వండి" కవిత అంది.

"నాతో చెప్పారుగా. ఇక దీని గురించి మరచిపొండి. నేను చూసుకుంటాను"

"ఏం చేస్తారు?" ఆత్రంగా అడిగింది లక్ష్మి.

"చెప్పను, చేసి చూపిస్తాను. మీకు రిజల్ట్ ఓ పది రోజుల్లో కనిపిస్తుంది. నేను ఏం చేశానో మీరు తెలుసుకుంటే ఆ విషయం ఎవరితోనూ చెప్పకుండా మీలోనే ఉంచుకోండి"

"తప్పకుండా. మాకు సహాయం చేస్తున్న మీకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవడం మా ధర్మం" అంది ఉమ.

"థాంక్యూ. అన్నట్టు మీకో గుడ్ న్యూస్. కిరణ్ సెలవులో వెళుతున్నాడు. ఓ వారం రోజుల దాకా రాడు. మీరు హాయిగా ఉండొచ్చు" అంటూ వెళ్ళిపోయాడు ప్రణవ్.

"అతని మాటలు నమ్మవచ్చంటారా?" లక్ష్మి అంది.

"ప్రణవ్‌ను నమ్మవచ్చు. అతను అనవసరంగా ఒకరి విషయంలో తలదూర్చడు. అవసరమైతే మాత్రం తనవంతు సహాయం తప్పకుండా చేస్తాడు. సో కిరణ్ ఇంకో వారం రోజుల దాకా రాడు. కనీసం ఈ వారం రోజులన్నా హాయిగా గడుపుదాం" అంది ఉమ.

* * *

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" వసుంధర భర్తను అడిగింది.


ఆఫీసులో జరిగిన విషయాలు చెప్పాడు ప్రణవ్.

"మనుషులు ఎందుకిలా శాడిస్టులుగా అయిపోతున్నారో నాకర్థం కావడం లేదు. మా బ్రాంచిలోని ఆడవాళ్ళు మంచి నడవడిక గలవారు. ఆ విషయం అతనికీ తెలుసు. మరి వాళ్ళను మాటలతో ఇబ్బంది పెట్టి ఏం సాధించగలడు? ఆడవాళ్ళ మనసు వెన్నపూసలాంటిది. కాస్త అభిమానంగా, ఓదార్పుగా మాట్లాడే వాళ్ళంటే ఇష్టపడతారు. ఇలా ఇబ్బంది కలిగించే మాటలు మాట్లాడితే వాళ్ళను దూరం చేసుకోవడం తప్ప ఇంకేం లాభం వుండదు" బాధగా అన్నాడు ప్రణవ్.

"అబ్బ! ఎంత బాగా ఆడవాళ్ళ మనసుల్ని చదివారండీ"

"నిజం వసూ! గొప్ప చెప్పుకుంటున్నాను అని నువ్వను కోకపోతే మా బ్రాంచిలోని ఆడవాళ్ళందరితో నాకు మంచి ఫ్రెండ్‌షిప్ వుంది. ఆ ఫ్రెండ్‌షిప్ ఎన్నో ఏళ్ళుగా కొనసాగుతూనే వుంది. వాళ్ళు మన ఇంటికి కూడా వచ్చి నీతో అభిమానంగా మాట్లాడుతూ ఉంటారు కదా. వీళ్ళను దూరం చేసుకోవాలంటే ఒక్క మాట, ఒక్క వెకిలి వేషం చాలు. కానీ మనుషుల్ని సంపాదించడం కన్నా దూరం

**సి.ఎస్.చంద్రశేఖర్**



చేసుకోవడం చాలా సులభం అన్న విషయం తెలిసిన వాడిని. అందుకే వాళ్ళతో ఎంత క్లోజ్‌గా వుంటానో అంతే బ్యాలన్స్‌డ్‌గా కూడా ఉంటాను''

“మీ సంస్కారం అలాంటిది. పైగా మీకు నొప్పించడం తెలియదు. అన్నట్టు పాపం వాళ్ళ ప్రాబ్లెమ్ సాల్వ్ చేయడానికి ఏదో ఉపాయం ఆలోచిస్తానన్నారు. ఆ పని చేయండి ముందు. వేడిగా కాఫీ తీసుకురానా?'' అంది వసుంధర.

“వద్దు. ఉపాయం తోచింది. ఇక ఆచరణలో పెట్టడమే తరువాయి. నేను శేఖర్ దగ్గరికి వెళ్ళివస్తాను. వాడి చేతిరాతతో పనుంది నాకు'' అంటూ చెప్పులు వేసుకోసాగేడు.

“శేఖరన్నయ్య కూడా మీ ప్లానులో పాలుపంచుకుంటున్నాడన్న మాట''

“వాడే కాదు. గూడూరులో ఉన్న హేమంత్ కూడా సహాయ పడాలి. అప్పుడే నా ప్లాను సక్సెస్ అవుతుంది''

“అంత దూరంలో ఉన్న ఆయనెందుకు ఇబ్బంది పెడతారు?''

“ఎందుకంటే కిరణ్ ఇక్కడికి రాకముందు గూడూరులో పనిచేశాడు కనుక. నేను వెళ్ళి వచ్చాక అన్నీ వివరంగా చెబుతాను. అందాకా ఓపికపట్టు'' అంటూ స్కూటర్ బయటకు తీసి స్టార్ట్ చేశాడు.

* * *

లీవునుంచి వచ్చి ఆఫీసులో జాయిన్ అయిన కిరణ్‌ను పలకరించాడు అటెండరు గోవిందం.

“సార్! మీకు వారం రోజుల క్రితం ఓ ఉత్తరం వచ్చింది''

“ఏదీ? తీసుకురా''

“ఆ ఉత్తరం రోజుకొక సీటుకు తిరుగుతూ అందరూ చదువుతూంటే చూసి భద్రం చేశాను. ఇప్పుడే వెళ్ళి తెస్తాను'' అంటూ వెళ్ళి తిరిగి వచ్చి అతని చేతిలో ఉత్తరం పెట్టాడు.

పోస్ట్ కార్డ్‌పై రాసిన ఉత్తరం అది. చదవసాగేడు కిరణ్.

కిరణ్‌గారికి,

మీరు గూడూరు వదలి వెళ్ళాక మళ్ళీ రాలేదు. మీకు చిత్తూరు జిల్లాకు బదిలీ అయిందని తెలిసిందిగానీ ఏ బ్రాంచ్‌కి వేశారో తెలియలేదు. అందుకే చిత్తూరు జిల్లాలో వున్న మీ ఆఫీసు అన్ని బ్రాంచీలకు లెటర్ పంపుతున్నాను. అలాగైనా నా ఉత్తరం మీకు చేరుతుందని నా ఆశ.

మందులు వాడాక ఎలా వుంది? పూర్తిగా వాడాక తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. సంవత్సరం తర్వాత మీరు హాయిగా పెళ్ళి చేసుకోవచ్చు. పిల్లలు కూడా పుట్టే అవకాశం వుంది.

ప్రస్తుతం మీరున్న పరిస్థితిలో అందరితో కాస్త అసభ్యంగా మాట్లాడే అవకాశం ఉంది. అందువల్ల వీలైనంత తక్కువగా మాట్లాడండి. మీరు నాకివ్వవలసిన బేలెన్స్ నాలుగు వేలూ వెంటనే పంపేది. నేను మళ్ళీ మందులు తయారు చేసుకోవాలి.

మీ డ్రాఫ్ట్ కోసం ఎదురు చూస్తూ

డా.భీమారావు

సెక్స్ స్పెషలిస్టు

ఉత్తరం చదివిన కిరణ్‌కు ఒళ్ళు మండిపోయింది. ఎవరీ భీమారావు? తనకెందుకు రాశాడు. కొంతసేపు ఆలోచించాక ఇది ఎవరో ప్లాన్ చేసి రాశారని అతనికి అర్థమైంది. అయితే ఎవరు రాశారో, ఎందుకు రాశారో అతనికి అర్థం కాలేదు.

స్టాఫ్ అందరూ వరుసగా ఒక్కొక్కరూ రావడం, ఆ ఉత్తరం గురించి ప్రస్తావించడం అతనికి తలనొప్పి తెప్పించింది. అందరితో అది తనకు సంబంధించినది కాదని చెప్పాడు. ఇది చాలనదన్నట్లు ఇతర బ్రాంచీల నుంచి ఉత్తరాలు రీ డైరెక్ట్ చేయబడి అతని రాసాగేయి.

ఆ తర్వాత స్టాఫ్ అందరూ ఆ ఉత్తరంలోని విషయాన్నే అన్ని సందర్భాలలోనూ అతనితో ప్రస్తావించసాగేరు.

“నా డ్రాఫ్ట్ రాశారా'' అంటే “గూడూరుకేనా'' అనడం, “కిరణ్‌గారూ, మాకు పప్పన్నం ఎప్పుడు పెడతారు'' అని ఒకడంటే “అప్పుడే ఎక్కడ, ఇంకా సంవత్సరం ఆగాలి. భీమారావు క్లియరెన్స్ ఇవ్వాలి'' అని ఇంకొకరు అనడం అతన్ని మానసికంగా బలహీనుణ్ణి చేసింది.

ఆ తర్వాత అతను ఎవరితోనూ అసభ్యంగా మాట్లాడలేదు. అంతేకాదు, ఆడవాళ్ళతో మర్యాదగా ప్రవర్తించసాగాడు. అతనిలో మార్పు చూసి మనసులోనే థాంక్స్ చెప్పుకుని హాయిగా ఆఫీసులో పనిచేసుకోసాగేరు లేడీ స్టాఫ్.